క్లుప్తంగా

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ


సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివప్రసాద్ యాదవ్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివప్రసాద్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయన సబ్ జైలులోని బ్యారెక్‌లు, టాయిలెట్లు, వంటగది, స్టోర్ రూంలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. జైలులో వసతులపై ఆరా తీశారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ దాదాఖలందర్, పారా లీగల్ వలంటీర్ అనిత, డాక్టర్ సయ్యద్ హర్షద్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పులకుర్తిలో తాగునీటి ఎద్దడి


వ్యవసాయ బోరు నుంచి ద్విచక్ర వాహనంపై నీరు తీసుకొస్తున్న దృశ్యం

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని పులకుర్తిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఐదు రోజులుగా ఈ సమస్య తీవ్ర రూపం దాల్చినా పట్టించుకునే నాథుడే లేరు. గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణం పేరుతో ఐదు రోజులుగా పంచాయతీ నీటి సరఫరా నిలిపేశారు. దీంతో గుక్కెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టే ప్రాంతంలో నీటి సరఫరా నిలిపి, మిగిలిన ప్రాంతాలకు ఆటంకం లేకుండా సరఫరా చేయాలని పాలకులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని స్థానికులు మండిపడ్డారు. విధిలేక వ్యవసాయ బోర్ల వద్ద తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి విగ్రహ ప్రతిష్ట


మహాగణపతి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్న పండితులు బ్రహ్మశ్రీ సరున్మోహన్ తంత్రి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కొల్హాపురి మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ కేరళ పండితులు బ్రహ్మశ్రీ సరున్మోహన్ తంత్రి వేదమంత్రోచ్చారణల మధ్య మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠను మంగళవారం నిర్వహించారు. ప్రతిష్ట పూజల్లో భాగంగా ఆలయం వద్ద మహాగణపతి హోమం, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద గణపతి విగ్రహ ప్రతిష్ఠలకు శనగప్పగారి ఎల్లమ్మ దాతలుగా వ్యవహించారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయం వద్ద తీర్థ ప్రసాదాలు అన్నదానం నిర్వహించారు.

డీసీ కమిటీ అధ్యక్షుడిగా కేశవరెడ్డి ఎన్నిక


డీసీ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: హెచ్ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కే కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బీటీ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం అనంతపురంలోని హెచ్చెల్సీ ఈఈ కార్యాలయం (లోక్ డివిజన్)లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు జరిగాయి. హెచ్ఎల్ఎంసీ పరిధిలోని 11 సాగునీటి సంఘాలుండగా, ఇటీవల ఎన్నికైన అధ్యక్షుడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. హెచ్చెల్సీ ఈఈ పి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన డీసీ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షులుగా శ్రీధరఘట్ట సాగునీటి సంఘం అధ్యక్షుడు కే.కేశవరెడ్డిని, ఉపాధ్యక్షుడిగా కణేకల్లు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు బీటీ రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభినందించారు.

పైప్‌లైన్ మరమ్మతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు శాంతినగర్ వద్ద ఏర్పడిన లీకేజీ మరమ్మతులను మంగళవారం ఇంజనీరింగ్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. లీకేజీ మరమ్మతు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఫిట్టర్లు కృష్ణమూర్తి, జగన్నాథ్ పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇతని పేరు సురేష్. వజ్రకరూరు గ్రామ రైతు. ఈయనకు మూడెకరాల పొలం ఉంది. కొన్నేళ్లుగా సురేష్ బోరు బావి కింద వేరుశనగ పంట సాగు చేస్తున్నాడు. అయితే రెండేళ్ల నుంచి జింకల మంద తన పొలంలోకి వచ్చి వేరుశనగ పంట తొక్కేస్తుండడంతో నష్టపోతున్నాడు. పంట చేతికందక పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పులమూట కట్టుకుంటున్నాడు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు తిప్పేస్వామి నాయక్. బెళుగుప్ప మండలం బెళుగుప్ప తండా గ్రామం. ఈరైతుకు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో రబీ సీజన్‌లో పప్పుశనగ సాగు చేశాడు. ఎకరాకు రూ. 8 వేల నుంచి రూ.10 వేలు వరకు ఖర్చు పెట్టాడు. వర్షాలు కూడా సకాలంలో పడటంతో అదనంగా 3 ఎకరాల పొలాన్ని గుత్తకు తీసుకొని శనగ సాగు చేశాడు. అయితే జింకల మందలు పొలంలో ఇష్టారాజ్యంగా తొక్కేయడంతో పంట ఎదుగుదలలేకుండా పోయింది. దీంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పచ్చని పంటలు జింకలపాలు

- మందలుగా సంచరిస్తూ పొలాలను నాశనం చేస్తున్న వైనం
- దాడుల్లో దెబ్బతింటున్న పంటలు
- పరిహారం అందించి ఆదుకోవాలంటున్న రైతులు


విడపనకల్లు వద్ద జింకలు ధ్వంసం చేసిన పంట


వజ్రకరూరు మండలం తట్రకల్లు వద్ద కంది పంటను నాశనం చేసిన జింకలు

ఉరవకొండ: ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసి, కంటికి రెప్పలా కాపాడుకుంటుంటే.. తీరా చేతికంది వచ్చిందనుకున్న సమయంలో పొలాలపై జింకల మందలు దాడి చేసి, నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు పంటలు నష్టపోవాల్సి వస్తోంది. రూ.వేలు పెట్టుబడి పెడితే.. కనీసం చేతిఖర్చులకు కూడా రావడంలేదని, తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని జింకల నుంచి పంటలను కాపాడుకునేందుకు సూచనలు ఇవ్వాలని, నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, బెళుగుప్ప మండలాల్లో దాదాపు 200 వరుకు జింకలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఏటా ఆయా మండలాల్లో దాదాపు 4,600 ఎకరాల్లో పప్పుశనగ, వేరుశనగ, ఆముదం, ధనియాల పంటను జింకలు తినడం, తొక్కడం చేయడంతో నాశనమవుతున్నాయి. ఇందులో ఒక్క వజ్రకరూరు మండలంలోనే 2,200 వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని పొలాల్లో జింకలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రూ.వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలను జింకలు ఒక్కసారిగా ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంట పొలాల వైపు చూడని అధికారులు

ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో జింకల సంచారంతో పంటలు దెబ్బతిన్నాయని అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. రెండు రోజుల క్రితం విడపనకల్లు మండలం డోనేకల్లు, హావళిగి గ్రామాల రైతులు మూకుమ్మడిగా అనంతపురంలోని డీఎఫ్ఓ కార్యాలయం వద్ద తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. తాము రాత్రింబవుళ్లు కంటికి రెప్పలా చూసుకున్న పంటలను జింకలు నాశనం చేస్తున్నాయని, జింకలను పట్టుకొని అటవీ ప్రాంతాల్లో వదిలి పంటలను రక్షించాలని డీఎఫ్ఓ విఘ్నేష్‌కు విన్నవించారు.

పరిహారం ఇవ్వాలి



అప్పు చేసి ఐదెకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. పంట చేతికందే సమయంలో జింకలు ఇష్టారాజ్యంగా గుంపులుగా వచ్చి పంట మొత్తం నాశనం చేశాయి. దీంతో రెండు ఎకరాల్లో పంట పూర్తి చేతికందకుండా పోయింది. అధికారులు పరిహారం అందించి ఆదుకోవాలి.

– బరగ్, హావళిగి గ్రామం, విడపనకల్లు మండలం

పరిహారం అందించేందుకు చర్యలు

ఉరవకొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో జింకలు మందలుగా వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని ఫిర్యాదు అందాయి. అయితే జింకలను పట్టుకోవడానికి చర్యలు తీసుకుంటాం. పంట నష్ట పోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించేందుకు కృషి చేస్తాం. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాత పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మధుబాబు, గుత్తి రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్, గుత్తి

గిరిజన పాఠశాలల ఉద్యోగులకు న్యాయం చేయాలి

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మౌలిక వసతులపై ఆరా తీశారు. కొన్ని రోజులుగా ఉపాధ్యాయులు సమ్మెలోకి వెళ్లడంతో విద్యాబోధన కుంటుపడిందని, దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేక ఫెయిల్ అయ్యే పరిస్థితి ఉందన్నారు. గిరిజన వసతి గృహానికి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రశేఖర్, మణికంఠ, భాస్కర్, హర్షవర్ధన్, భాస్కర్, రామాంజనేయులు, శ్రీనివాసులు, చంటి, అశోక్ పాల్గొన్నారు.

చిమ్మచీకటిలో బీటీ ప్రాజెక్టు


చీకట్లో ఉన్న బీటీ ప్రాజెక్ట్

రాయదుర్గం: జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన బీటీపీ చిమ్మచీకటిలో మగ్గుతోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుతో ప్రాజెక్టు, గేట్లు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ కాంతులు ఉండేవి. కూటమి అధికారంలోకొచ్చాక ఇటీవల ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. అత్యవసర పరిస్థితుల్లో రెండు గేట్లు ఎత్తాల్సి వచ్చింది. ఆ సమయాన ఎల్ఈడీ లైట్లు వెలిగించారు. లైట్లు తెలుపు, బ్లూ రంగులో కనిపించాయి. ఆ లైట్లు వెలిగించొద్దంటూ అధికారులపై కొందరు ఒత్తిడి తీసుకొచ్చినట్టు సమాచారం. వాటి స్థానంలో కొత్త లైట్ల ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ అధికారులు రూ.36 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. నెలలు గడుస్తున్నా నిధుల మంజూరులో జాప్యం కనిపిస్తోంది. ఫలితంగా ప్రాజెక్ట్ వద్ద కేవలం తెలుపు రంగులో ఉండే నాలుగు ఎల్ఈడీ లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి.

దాసరి తిమ్మరాజు సేవలు మరువలేనివి


చాబాలలో దాసరి తిమ్మరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు

వజ్రకరూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దాసరి తిమ్మరాజు సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని చాబాలకు చెందిన దాసరి తిమ్మరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే, విశ్వేశ్వరరెడ్డి చాబాలకు చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాసరి తిమ్మరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడుగా పార్టీబలోపేతానికి శక్తి వంచనలేకుండా కృషి చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం ఎంతో కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారన్నారు. స్థానిక సర్పంచు మల్లెల జగదీష్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, బెస్త కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప , పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చలపతి, రామ చంద్ర, గోవర్దన్, మోహన్, జగన్‌సూరి, మహిపతి, మల్లేష్, పుల్లయ్య, పరమేష్, అట్టెల హరి తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎల్ సంఘం అభివృద్ధికి కృషి చేయాలి


నూతన క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కళ్యాణదుర్గం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఏఎల్ సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఐఏఎల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి సుభాన్, రిటైర్డ్ ఏడీ కిష్టప్ప, ఐఏఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు కరణం తిప్పేస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప హాజరై మాట్లాడారు. ఐఏఎల్ సంఘాన్ని 75 ఏళ్ల క్రితం సుప్రీంకోర్టు న్యాయమూర్తులైన జస్టిస్ కృష్ణయ్య కృష్ణ అయ్యర్, జస్టిస్ చిన్నప్పరెడ్డి, జస్టిస్ భగవతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అనంతరం ఐఏఎల్ 2025 నూతన క్యాలెండర్లను వారు విడుదల చేశారు. సమావేశంలో ఐఏఎల్ నాయకులు మల్లికార్జున, సంపత్‌కుమార్, కృష్ణమూర్తి, భంగి రవి కుమార్, రామాంజనేయులు, దిలీప్, సుధ, న్యాయవాదులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనకు కృషి చేద్దాం

కణేకల్లు: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి సాధనపై రెండో విడత శిక్షణ తరగతులు జరిగాయి. ఈ శిక్షణ తరగతులు మంగళవారం నాటితో ముగిశాయి. ఎంపీడీఓ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, విద్య, ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం, సమానత్వం, పరిశుభ్రమైన నీరు పారిశుధ్యం, మహిళల ఆర్థిక స్వావలంబన లాంటి సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఈఓఆర్‌డీ చంద్రమౌళి, రీసోర్స్ పర్సన్ కణేకల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, ఏపీఎం ఆంజనేయులు, ఏపీఓ సుధాకర్‌తోపాటు వీఆర్‌ఓలు, అగ్రికల్చర్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి చేసుకుందాం

కూడేరు: అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని ఆదాయాన్ని పెంపొందించుకొని పంచాయతీలు అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పిలుపు నిచ్చారు. మంగళవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకంపై మండల స్థాయి అధికారులకు, సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దేవానంద ఫిలిప్సన్, పీఆర్ ఏఈ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి , సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


దుద్దేకుంటలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఆర్‌డీఓ వసంతబాబు

బెళుగుప్ప: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డీఓ వసంతబాబు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో సర్పంచ్ రత్నమ్మతో కలసి మండల తహసీల్దార్ షర్మిళ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలను రైతులు అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ చంద్ర, సర్వేయర్ నీలకంఠ, మాజీ వైస్ ఎంపీపీ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: ఇప్పేరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 85 అర్జీలు వచ్చాయి. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ ఆయేషా సిద్ధిక్, ఇతర శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుకు 11 వినతులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సర్వే కోసం 3 ,పట్టాదారు పాసుపుస్తకం కోసం 8 వినతులు అందాయి. ఎంపీడీఓ రామకృష్ణ, దేవదాయ, అటవీశాఖ అధికారులు , వీఆర్వోలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 21 వినతులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. మండల స్పెషలాఫీసర్ తిప్పేస్వామి, సర్వేయర్ రవితేజ, సర్పంచ్ కవిత, వీఆర్వో యుగేంధర్, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం


రాయదుర్గంలో పెన్షనర్లను సన్మానించిన దృశ్యం


నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సబ్ ట్రెజరీ అధికారి, ఎస్‌బీఐ మేనేజర్లు

కళ్యాణదుర్గం: స్థానిక పెన్షనర్ల భవనంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం జరిగింది. సంఘం అధ్యక్షుడు శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 75 ఏళ్లు పైబడిన 15 మంది పెన్షనర్లకు, సంఘం అభివృద్ధికి పాటుపడిన 10 మంది సభ్యులను సన్మానించారు. సహాయ ఖజానాధికారిణి సరస్వతి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి తిప్పేస్వామి, సభ్యులు అంజినప్ప, మారెన్న, నాగరాజు, ఫకృద్దీన్, భగవాన్ దాస్, చెన్నప్ప, నరసింహులు, పాండురంగ పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్ : పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద గల పెన్షనర్ల అసోసియేషన్ భవనం, రైల్వేస్టేషన్ రోడ్డు ఓంశాంతి వద్ద నున్న పెన్షనర్ల భవనంలో పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. ఓంశాంతి వద్దనున్న పెన్షనర్ల భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామన్న అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఆరుగురు సీనియర్ పెన్షనర్లు, పోలీస్‌స్టేషన్ వద్దనున్న పెన్షనర్ల భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముగ్గురు సీనియర్ పెన్షనర్లను సన్మానించారు.

ఘనంగా విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

ఉరవకొండ: స్థానిక ఎస్‌బీ బ్రాంచ్ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ భవన్‌లో విశ్రాంత ఉద్యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 70 ఏళ్లు పైబడిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కిష్టప్ప అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఉరవకొండ సబ్ ట్రెజరీ అధికారి నాగేంద్రబాబు, ఉరవకొండ ప్రధాన ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, బజార్ బ్రాంచ్ మేనేజర్ వీరేంద్రనాథ్ మాట్లాడారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి నారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గిరిజన పాఠశాల తనిఖీ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని మారెంపల్లిలోని గిరిజన గురుకుల పాఠశాలను డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలకు చెందిన విజయ్ సాయి పాఠశాల నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయంపై ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్ సీరియస్‌గా తీసుకుని పోలీసుల సహకారంతో అనంతపురంలో బాలుడు ఉన్నట్లు గుర్తించి తీసుకొచ్చారు. ఈ ఘటనపై డీటీడబ్ల్యూ పాఠశాలను తనిఖీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని ప్రిన్సిపాల్ నాగరాజును హెచ్చరించారు. విద్యార్థులకు పూర్తి రక్షణ కల్పించాలని సూచించారు. అయితే డీటీడబ్ల్యూఓ పాఠశాల తనిఖీపై స్థానిక పాఠశాల ఉద్యోగులు, సిబ్బంది గోప్యంగా ఉంచారు.

ఘనంగా హజరత్ ఇమాంషావలి ఉరుసు


ఇమాంషావలి వారి సమాధి

కణేకల్లు: మండలంలోని మాల్యంలో హజరత్ ఇమాంషావలి ఉరుసు మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఉరుసుకు భక్తులు పోటెత్తారు. కులమతాలకతీతంగా జరుపుకునే ఉరుసుకు వేలాది మంది భక్తులు తరలి రావడంతో దర్గా ప్రాంగణమంతా కిక్కిరిసింది. భక్తులు హజరత్ ఇమాంషావలికి చెక్కరను తులాభారమిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనేక మంది పూల చద్దర్‌ను సమర్పించారు.

ముత్యాలపల్లకీలో ఊరేగిన వీరభద్రుడు

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో వెలసిన వీభద్రస్వామిని ముత్యాలపల్లకీలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామికి ఆలయంలో అర్చకులు వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన ముత్యాలపల్లకీలో అధిష్ఠించి గ్రామంలో వీధులలో మేళతాళాలతో ఘనంగా ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకీ ముందు చిన్నారులు కలశాలను ప్రదర్శించారు. యువకులు నందికోళ్లతో నృత్యం చేశారు. పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

మారెమ్మ దేవతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలందుకున్న మార్నెమ్మ దేవత

రాయదుర్గంటౌన్: కోటలో వెలసిన గౌరసముద్రం మారెమ్మ దేవతకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కార్తీక పూజలు, సాయంత్రం దీపారాధనతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. స్థానికంగా పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని కుష్టు రోగుల కాలనీ వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన రాము, నాగార్జున అనే ఇద్దరు యువకులు గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై ఉరవకొండ నుంచి అనంతపురం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

రాయదుర్గం: చదంలో హరిజన గంగప్ప హత్య కేసులో ప్రధాన నిందితులు శివ, వంశీ, సూర్యను మొలకాల్మూరు రోడ్డు గాలిమారెమ్మ ఆలయం వద్ద మంగళవారం అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. దాయాదుల మధ్య పొలం గట్టు విషయంలో తలెత్తిన వివాదమే హత్యకు కారణమని వివరించారు. నాలుగేళ్లుగా ఇరు కుటుంబాల మధ్య గొడవులు జరుగుతున్నాయన్నారు. పత కం ప్రకారమే హత్య చేశారన్నారు. ముగ్గురు నిందితుల నుంచి ద్విచక్ర వాహనం, వెపన్, 3 కర్రలు, దుస్తులు సీజ్ చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించారన్నారు. నిందితుల వద్ద వెపన్ పట్టుబడడం విశేషం.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం: ఒంటిమిద్దిలో ట్రాక్టర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...కణేకల్ ప్రాంతం నుంచి వరిగడ్డితో దేవాదుల కొండకు వెళ్తున్న ఓ ట్రాక్టర్ మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లు తగిలి నిప్పురవ్వలు రాజుకున్నాయి. వరిగడ్డికి నిప్పు అంటుకోవడంతో అప్రమత్తమైన గ్రామస్తులు.. వెంటనే ట్రాక్టర్‌ను పక్కకు ఆపి నీటితో మంటలు ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్ఐ విష్ణుతేజ్

కళ్యాణదుర్గం: మండలంలోని గోళ్ల గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న విష్ణుతేజ్ కార్యాలయ విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై అనంతపురం బయల్దేరాడు. గోళ్ల గ్రామ సమీపంలోని మారెమ్మ గుడి వద్దకు రాగానే గ్రామం నుంచి బైపాస్‌లోకి వెళ్తున్న ట్రాక్టర్, బైకు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో విష్ణుతేజ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆర్డీఓ వసంతబాబు విష్ణుతేజ్‌తో ఫోన్లో మాట్లాడి ఆరోగ్యంపై ఆరా తీశారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.